5

# దేవునిచేత ఏర్పరచబడినవారు

> "ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున, యేసు క్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ. 1:4-6).

జ్ఞాపకం చేసికోబడాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. మనలో ప్రతి ఒక్కరియందుండే ఈ కోర్కె ప్రసిద్ధికెక్కిన మన గ్రామీణ భాషా ప్రయోగాలకు దారితీసియుండవచ్చు. మనం ప్రేమించేవారికి పంపే బర్త్‌డే కార్డుమీద, "నేను నిన్ను గూర్చి ఆలోచిస్తున్నాను" అని వ్రాస్తుంటాం. మన టెలిఫోన్ సంభాషణలో, మనకు ఎక్కువగా పరిచయముండి ఎక్కువ ప్రియులైన వారితో, "నేను నిన్ను గూర్చి ఆలోచిస్తూ ఉన్నాను" అని అంటుంటాం. మనం ఒక సెలవులకు వెళ్లేటప్పుడుగాని, మరి యింకేదైనా ప్రయాణమప్పుడుగాని, మన యింటివారికి గుడ్‌బై (యింక సెలవు అని) చెప్పేటప్పుడు, "మేము మిమ్మును గూర్చి ఆలోచిస్తూ ఉంటాం" అని అంటాం. ఈలాటి మాటలు మాట్లాడడంలో వారిని మరచిపోలేదని మరచిపోమని, వారు మనకు ప్రత్యేకమైనవారనే తలంపులను సున్నితంగా ఎరుకపరుస్తాం. నిష్కపటంగా అవి పలుకబడినా, లేక మనకు వ్రాయబడినా, ఈ మాటలు మనలను తాకుతాయి మరియు బలపరుస్తాయి.

మేము నిన్ను గూర్చి ఆలోచన చేస్తున్నామని స్నేహితులు, బంధువులు అన్న మాటలే అర్థసహితముగా ఉన్నప్పుడు, తన దృష్టిలో మనం ప్రత్యేకమైనవారమని దేవుడు తెలిపేది మరి యింక ఎంతటి అర్థసహితమైనదై ఉండాలి! నీవు క్రీస్తునందున్నట్టయితే, ఈ విషయమే దేవుడు నీతో చెప్పియుంటాడు. ఎఫెసీ. 1:4-6లో, క్రైస్తవులు దేవునిచే ఏర్పరచబడినవారని పౌలు తెలిపాడు. క్రీస్తునందు విమోచింపబడిన వారందరు దేవునిచే ఎన్నుకొనబడినవారని లేఖనములచే నిశ్చయంగా చెప్పబడ్డారు! ఇది నిన్ను గొప్పగా బలపరచదా?

దేవునిచే ఏర్పరచబడిన వారం అంటే ఎంతో ప్రాముఖ్యమైనదని, భూమిమీదనున్న ఘనతలన్నింటికంటెను అది మిన్నయైయున్నట్టు మనం దాన్ని చూడాలని ఆత్మ ఉద్దేశించిన సంగతి పౌలు మాటల్లో చెప్పబడిన తీరునుబట్టి మనం ఎరుగగలం. చిన్న ఆసియాలోని ఎఫెసు సంఘానికి పౌలు ఈ సంగతులు వ్రాశాడు ఈ పత్రికయొక్క చర్చనీయాంశం "సంఘము క్రీస్తుయొక్క శరీరం" అని సంక్షిప్తం చేయవచ్చు. దేవునిచే ఏర్పరచబడినవారితో సంఘం నిర్మింపబడిందని ఈ పత్రికయొక్క ఆరంభంలో పౌలు వ్రాశాడు. వారు దేవునిచే ఎన్నుకొనబడినవారు, తన దైవికమైన ఆశీర్వాదములకొరకు ఏర్పరచబడ్డారు. ఈలాటి

ఏర్పాటును "భవిష్యత్ నిర్ణయం," ముందుగా నిర్ణయించుకొనడం లేక ముందుగా ఏర్పరచుకొనడం అని ఆయన పిలిచాడు (ఎఫెసీ. 1:5).

ఈలాటి దేవుని ఏర్పాటు కొన్ని ప్రశ్నలను రేకెత్తిస్తుంది, కదా? ఒక వ్యక్తి రక్షింపబడాలని మరో వ్యక్తి నశించాలని దేవుడు ఏర్పరచుకున్నాడని పౌలు అంటున్నాడా? ఒక వ్యక్తిని పరలోకానికిని మరో వ్యక్తిని నరకానికిని ఆయన ఏర్పరచుకొని ఉన్నట్టయితే, యోహాను 3:16లో ప్రభువైన యేసు చెప్పినట్టు, లోకంలోని ప్రతి వ్యక్తికొరకు దేవుడు తన ప్రత్యేకమైన ప్రేమను ఎలా కలిగియుండగలడు?

భవిష్యత్ నిర్ణయం అనే ఈ వింతైన అంశంమీద లేచే మన ప్రశ్నకు పౌలు జవాబు యిచ్చే ఈ లేఖన భాగాన్ని జాగ్రత్తగా ఆలోచన చేద్దాం. ఎఫెసీ. 1:4–6లో, దేవుడు ప్రతి వ్యక్తిని ఎలా ప్రేమిస్తున్నాడు. లోకం పుట్టక మునుపే మనలను గూర్చి ఆయన ఎలా ఆలోచించాడు, ఏర్పరచబడినవారిని ఆయన ఎలా ఏర్పరచుకున్నాడు అనేవాటిని చూద్దాం.

## ఆయనయందు ఏర్పరచుకొన్నాడు

మొదటిగా, "ఆయనయందు ఏర్పరచుకొనెను ..." అని పౌలు చెప్పాడు (ఎఫెసీ. 1:4; ఒత్తి పలకడం నాది) తన రక్షణను యితర ఆత్మసంబంధమైన ఆశీర్వాదములను దేవుడు యివ్వబూనుకొన్నది ఆయన కుమారుని శరీరమనే చోటనే. ఆ శరీరంలోనికి వచ్చినవారు ఏర్పరచబడినవారయ్యారు.

ఎఫెసీ. 1:4–6 యొక్క విశాలమైన సందర్భంలో, బైబిల్లోని అతి పెద్ద వాక్యం ఎఫెసీ. 1:3–14 యొక్క స్తుతియంతటిలో క్రీస్తునందు ఉద్దేశింపబడిన ప్రత్యేకమైన ఆశీర్వాదములను పౌలు లెక్కించడం జరిగింది. దేవుని కుమారులుగా స్వీకరించబడడం (5 వ.), పాపక్షమాపణ (7 వ.), విమోచన (7 వ.), జ్ఞాన వివేకము (8 వ.), క్రీస్తునందు ఏకముగా సమకూర్చడం (10 వ.), స్వాస్థ్యం (11 వ.), పరిశుద్ధాత్మచే ముద్రించడం (13 వ.) అనువాటిని అతడు ప్రస్తావించాడు.

దేవుడు, నిత్యత్వపు గతంలో, క్రీస్తులోనికి వచ్చి, క్రీస్తుయొక్క కృపాదానమును సద్వినియోగం చేసికొనేవారిని, తన ఆశీర్వాదములకును, రక్షణకును పాత్రులగునట్లు ఎన్నుకున్నాడు లేక ఏర్పరచుకొన్నాడు. ఈ రక్షణా విధానాన్ని ముందుగా నిర్ణయించుకొని, దేవుని యొక్క నిత్యత్వపు గతంలో దాన్ని తీర్మానించుకొన్నాడు. ఇలా ఏర్పరచుకొనడంలో ఆయన పక్షపాత బుద్ధితోగాని చపల చిత్తంతోగాని ఏమియు చేయలేదు. ఒక వ్యక్తి నశించిపోవాలని, మరియొక వ్యక్తి రక్షింపబడాలని గాని ఆయన ముందుగా తీర్మానం చేయలేదు, కాని క్రీస్తునందలి రక్షణ సంఘమనే ఆత్మసంబంధమైన ఆయన శరీరంలోనికి ప్రవేశించి రక్షణపొందేవారు రక్షింపబడాలని ఆయన నిర్ణయించుకున్నారు.

"భవిష్యత్ నిర్ణయం" అంటే "ముందుగా స్థాపించు లేక స్థిరపరచు" అని, "భవిష్యత్ జ్ఞానము" అంటే, "ముందుగా ఎరుగు" అని అర్థం. ఎవరు రక్షింపబడతారో, ఎవరు నశించిపోతారో దేవునికి తెలిసియుండవచ్చు, కాని వ్యక్తిగతమైన వారి రక్షణ గాని వారి వ్యక్తిగతమైన నాశనం గాని ఆయన ముందుగా తీర్మానించడు. క్రీస్తులోనికి వచ్చుటలో

తన సొంత నిర్ణయాన్ని చేసికొనడంలో రక్షింపబడతాడో లేదో అనేది వాని సొంత తీర్మానం మీద ఆధారపడియుంటుంది.

"భవిష్యత్ జ్ఞానము, భవిష్యత్ నిర్ణయము" అనే ఈ రెండు అంశాలు మనం పూర్ణంగా గ్రహించలేనంత లోతైనవి. వాటిని గూర్చి బైబిలు చెప్పే దానిని మనం విశ్వాసంతో అంగీకరించవలసి యుంటుంది. ముందుగా నిర్ణయించకుండ, దేవుడు ముందుగా ఎరుగ గలడనే విషయాన్ని బైబిలు గుప్తం చేస్తుంది. దేవుని భవిషత్ జ్ఞానము మన జ్ఞాపక శక్తితో పోల్చబడింది. నిన్న సంభవించిన సంగతులను మనం జ్ఞాపకముంచుకోగలం, అయితే నిన్నటి విషయాలను జ్ఞాపకముంచుకున్నామంటే అవి సంభవించేలా మనం చేయలేం. గతంలోని సంగతులను మనం జ్ఞాపకం చేసికొన్నలాగున దేవుడు జరుగబోయే సంగతులను ఎరుగగలిగియుండవచ్చు. తన అనంత జ్ఞానంలో, ఆయన భవిష్యత్తును చూస్తాడు; కాని ఆయన వాటిని చూచిన విధంగా సంభవించేలా ఆయన చేయడు.

క్రొత్త నిబంధనలోని అపొ. 2:23 అనే ఒకే వచనంలో, మానవ సన్మార్గ ఎన్నిక మరియు భవిష్యత్ నిర్ణయం అనే రెండు భావనలు కన్పిస్తాయి. అది ఒకే (సెన్‌టెన్స్) వాక్యంలో కన్పించినా, అవి ఒకదానికొకటి విరుద్ధములుగా ఉండవు. "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యద్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి" అని పేతురన్నాడు (అపొ. 2:23). ప్రభువైన యేసుయొక్క మరణాన్ని దేవుడు ముందుగా ఎరుగును; ఆయన దానిని ముందుగా నిర్ణయించాడు, కాని దుష్టులైన మనుష్యులు దానికి బాధ్యులుగా నిలదీయబడ్డారు. మనుష్యులయొక్క స్వయం స్వేచ్ఛా చిత్తము, దేవుని భవిష్యద్ జ్ఞానము మరియు దేవునిచే జరిగింపబడిన భవిష్యద్ నిర్ణయం ఆ ఒకే వచనంలో కన్పిస్తాయి, అయినా ఒక భావన మరియొక భావనను కొట్టివేయలేదు.

జగత్తు పునాది వేయబడకమునుపే దేవుడు క్రీస్తునందు మన రక్షణను సంకల్పించాడు లేక ముందుగా నిర్ణయించాడు, కాని మనం రక్షింపబడడానికి గాను, రక్షణ పరిధిలోనికి, క్రీస్తు శరీరములోనికి మనం ప్రవేశించ కోరుకోవాలి. దేవునిచే ఏర్పరచబడిన జనంలో ఎవడైనా ఉండగోరవచ్చు. "ఎవరైతే యిష్టపడతారో వారు ఏర్పరచబడినవారై ఉంటారు, ఎవరు యిష్టపడకుండ ఉంటారో, వారు ఏర్పాటులో లేనివారై ఉంటారు" అని ఒకానొక వ్యక్తి అన్నాడు.

నీవు దేవునిచే ఏర్పరచబడినవాడవా? ఆయనచే ఏర్పరచబడినవాడవని నీవు ఎలా ఎరుగగలవు? పౌలు ప్రకారం, జవాబు చాలా చిన్నది: నీవు ఆయనలో ఉన్నావా? క్రీస్తునందున్నవారు ఏర్పరచబడిన వారిలో ఉన్నారని ఆనందింపవచ్చు. తేదీలేని నిత్యత్వపు గతంలో, దేవుడు ఏర్పరచుకొని లేక ముందుగా నిర్ణయించుకొనిన క్రీస్తునందు ఆశీర్వాదము యొక్క స్థలంలో ఉన్నాం. మన భూ నివాస కాలంలో క్రీస్తునందు మనం నమ్మకంగా జీవించినట్టయితే, పరలోకము మన నిత్య స్వాస్థ్యమైయుంటుంది.

## నిత్యత్వంనుండి ఏర్పరచబడినవారు

రెండవది, దేవునిచే ఎన్నుకొనబడినవారు, సంఘము, నిత్యత్వమందే ఏర్పరచబడిన వారు, జగత్తు పునాది వేయబడకమునుపే ఏర్పరచబడినవారై యున్నారు. "**జగత్తు పునాది వేయబడకమునుపే** క్రీస్తునందు ఆయన మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ. 1:4; ఒత్తి పలకడం నాది).

NASBలో "పునాది" అని తర్జుమా చేయబడిన గ్రీకు ప్రాథమిక పదాన్ని పౌలు వాడాడు. దానికి "ప్రారంభం యొక్క ప్రారంభానికి ముందు" అని అక్షరార్థం. దేవుడు మనలను గూర్చి ముందుగా ఆలోచించి, తన వింతైన జనముగా ఉండునట్లు మనలను శ్రేష్ఠమైనవారిగా ఏరి ఎత్తుకొన్నది, మనం పాపమనేది ఎరుగకముందు, ఆరంభంలేని గత నిత్యత్వంలో, మనం సృజింపబడకముందు, లోకం నిర్మింపబడకముందు ఆయన పరిశుద్ధమైన అనంతమైన మనస్సులో, ఆయనచే ఎన్నుకొనబడినవారంగా క్రీస్తు సిలువ మరణం, మరియు సంఘమును క్రీస్తు ఆత్మసంబంధమైన శరీరమందు రక్షణ సంకల్పం కేంద్రీకృతం చేయబడింది. ఈ భావంతో, జగదుత్పత్తి మొదలుకొని వధింపబడిన దేవుని గొర్రెపిల్లగా క్రీస్తు ప్రభువు తెలుపబడవచ్చు (ప్రకటన 13:8; 1 పేతురు 1:19, 20).

దేవుడు యిర్మీయాకు యిలా తెలిపాడు, "–గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని, నీవు గర్భమునుండి బయలుపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని, జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని" (యిర్మీయా 1:5). "తల్లిగర్భమునందు పడినది మొదలుకొని" దేవుడు తన్ను ప్రత్యేకపరచుకొన్నట్టు పౌలు తెలిపాడు (గలతీ. 1:15). అటు యిర్మీయాయొక్కగాని యిటు పౌలుయొక్కగాని స్వయిష్టాన్ని దేవుడు రద్దుపరచలేదు, కాని వారు జన్మింపక ముందే దేవుడు వారిమీద తన దృష్టిని నిలిపాడు. తన సృష్టియొక్క స్వేచ్ఛా చిత్తంతో జోక్యం పుచ్చుకొనకుండగనే, దేవుడు తన సంకల్పాన్ని ప్లాన్ చేసి, ముందుగా తీర్మానించుకోగలడు. మనం దాన్ని గ్రహించలేకపోవచ్చు, కాని దేవుని వాక్యంలో దాన్ని గూర్చిన స్పష్టమైన ఉపదేశం ఉన్నందున దానిమీద మనం నిలిచియుండవచ్చు.

దేవునికి సంఘం ఎంత ప్రాముఖ్యమైనదో నీవు గ్రహించుకొనగోరితే, జగత్తు పునాది వేయబడకమునుపే సంఘము తన ఏర్పరచబడిన జనమైయుండునట్లు ఆయన కోరుకున్న దాన్నిగూర్చి ఆలోచించు. దేనినీ ఆయన నిర్మించక ముందే దేవుడు యిలా కోరుకున్నాడు, "అది జరిగినప్పుడు నేను మొదటిగా యోచించింది ..." అని మన ప్రాధాన్యతలను తరచుగా ఆయా పరిస్థితులలో మనం తెలుపుతాం. ఆ సందర్భంలో మనకు ఏది ప్రాముఖ్యంగా తోచిందో మనం బయలుపరచే మార్గం అది. దేవుని వాక్యంయొక్క పరిశోధనా సాధనంవలన, తన మనస్సులో ఉన్నదేదో దానిని చూడడంవలన మనం తెలిసికో గలుగుతాం: "జగత్తు పునాది వేయబడకమునుపే ఆయన మనలను క్రీస్తునందు ఏర్పరచుకొనెను." తాను ఏర్పరచుకొన్న జనంగా, కోరుకొనబడిన తన ప్రజలుగా, సంఘము దేవుని మనస్సులో జగత్తు పునాది వేయబడక మునుపే ఉన్నారు.

ఎన్నుకోబడినవారు దేవునికి ఎంత ప్రియమైనవారో! కాలారంభానికి ముందుగానే

వారు దేవుని మనస్సులో మెదులుతున్నట్టున్నారు. ఈ సత్యము మనలో సజీవమై, దైవికమైన ప్రోత్సాహముతో మనలను బలపరచుతూ ఉండాలి.

## పరిశుద్ధతకొరకు ఏర్పరచబడినవారు

మూడవది, పరిశుద్ధతకొరకు మనం ఏర్పరచబడ్డామని పౌలు చెప్పాడు. అతడు యిలా వ్రాశాడు, "... మనము తన యెదుట **పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని** జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తునందు మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ. 1:4; ఎంఫసిస్ నాది). మనం ఆయన ఉద్దేశంకొరకు ఏర్పరచబడ్డాం.

సంఘము తన జనమైయుండి, తన స్వభావాన్ని, పోలికను ప్రతిఫలింపజేయాలని ఏర్పరచుకున్నాడు. సంఘము పరిశుద్ధమైనదిగా ఉండాలని ఆయన నియమించాడు. పేతురు యిలా తెలిపాడు, "కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞాన దశలో మీకుండిన ఆశలననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడై యున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి" (1 పేతురు 1:15, 16). పరిశుద్ధత అంటే, పాపమునుండి శుద్ధీకరింపబడి దేవుని పవిత్రమైన ఉపయోగంకొరకు ప్రత్యేకంగా (కడగా) పెట్టబడడం అని అర్థం.

నిర్దోషులుగా ఉండాలనికూడా దేవుడు తన ప్రజలను ఏర్పరచుకొన్నాడు. ఈ మాటకు "దోషము లేకుండుట" లేక "తప్పు లేకుండుట" అని అర్థం. దేవుని ప్రజలయొక్క గురిని యిది సూచిస్తుంది. ఆయన యెదుట మనం లోపములేని జీవితాలను జీవించుచూ ఉండాలి. ఈ జీవిత కాలంలో ఈ అభిలాషను ఎన్నడు పరిపూర్ణంగా సాధించలేకపోయినా, మన హృదయాలయొక్క ఎడతెగని స్వభావం లేక తత్వం అదైయుండాలి. పరిశుద్ధత, నిందారహితతకొరకైన మన ప్రయాసకు ఫలితాలు నిత్యత్వంలో ఆయన సింహాసనం యెదుట నిలిచేవరకు పొందబోము. క్రైస్తవులు, పోషించువారి ప్రభువుయొక్క ఆదేశాన్నిబట్టి, తమమీద న్యాయ సమ్మతమైన ఏ నేరము లేకుండ క్రైస్తవులు దేవుని యెదుట జీవిస్తారు.

---

జగత్తు పునాది వేయబడకమునుపే క్రీస్తునందు
దేవుడు మన రక్షణను సంకల్పించాడు లేక ముందుగా
నిర్ణయించాడు, కాని రక్షింపబడడానికి, రక్షణయొక్క
పరిధిలోనికి, క్రీస్తు శరీరంలోనికి మనం రాగోరవలసియుంది.

---

"యేసు క్రీస్తు ద్వారా మనలను తనకు కుమారులనుగా స్వీకరించవలెనని ముందుగా నిర్ణయించుకున్నట్టు" కూడా పౌలు తెలియజేశాడు (ఎఫెసీ. 1:5). ఆయన మనలను తన పిల్లలుగా ఉండగోరుకున్నాడు. ఈ సందర్భంలో స్వీకారమంటే, "కుమారత్వంయొక్క సమస్త హక్కులు, ఆధిక్యతలు, బాధ్యతలు పొందడమని దాని భావం." దత్త స్వీకార సమయంలో, దేవుని కుటుంబములో గుప్తమైయున్న కుమారత్వమంతటిని పొందడం.

క్రీస్తులోనికి వచ్చువారిని దత్త స్వీకారం చేసికొని, తన కుమారులనుగా స్వీకరించి, సమస్త హక్కులను, ఐశ్వర్యాన్ని, మరియు దైవికమైన తన కుటుంబం యొక్క బాధ్యతలను వారికి ప్రసాదించాలని – దేవుడు ముందుగా నిర్ణయించాడు – ముందుగా తీర్మానించుకున్నాడు – ఆరంభంలేని గత నిత్యత్వమందు నిశ్చయించుకున్నాడు.

రేడియో స్టేషన్‌కు నీవు పిలువబడి, “నీవు ఎన్నుకోబడ్డావు, మేము నిన్ను ఎన్ను కున్నాం” అని నీవు చెప్పబడ్డావనుకో. “దేనికొరకు ఏర్పరచుకున్నారు?” అని నీవు వెంటనే అడుగుతావు. “మేము నిన్ను ఏర్పరచుకున్నాం, కాని దేనికొరకో మాకు తెలియదు, మేము నిన్ను ఏరి తీసికొనినప్పుడు మా మనస్సులో ఏ విశేషమైన సంగతి లేదు. ఇప్పుడు మేము నీకు చెప్పగలిగినదంతా నీవు ఏర్పరచబడినవాడవనే. గంపలో వేలకొలది పేర్లున్నాయి, చీట్లు తీయబడినప్పుడు, నీ పేరు వచ్చింది, గనుక నీకు అభినందనలు తెలపడానికి నిన్ను పిలిచాం.” “నీవు ఎందుకు ఏర్పరచుకొనబడ్డావో తెలియదు” అని విన్నప్పుడే ఏర్పరచుకొనబడ్డావనే దానిలోని ఉత్సాహం అంతరించింది. నీ ఎన్నిక విశేషమయ్యిందిగా నీవు ఆలోచించవు. దాని భావంయొక్క తబ్బిబ్బులోనే ఏర్పరచబడడం అనే దానిలో ఉండే పులకరింపు అంతరించిపోతుంది.

దేవుని ఏర్పాటు వెనుక ఉద్దేశముంది. క్రీస్తునందు తన రక్షణను, కుమారులనుగా స్వీకరించడాన్ని, ఈ లోకమందు తన జనులుగా, పరిశుద్ధులుగాను, నిర్దోషులుగాను ఉండనుద్దేశంతో దేవుడు మనలను ఏర్పరచుకున్నాడు. దైవికమైన పనికొరకు పిలువబడి, ప్రత్యేకింపబడిన జనులుగా ఉండునట్లు ఆయన మనలను ఏర్పరచుకున్నాడు.

దేవుని వాక్యానికి స్థిరంగా అప్పగించుకున్న దానినిబట్టి పరిశుద్ధత, నిర్దోషత్వము మెయిన్‌టెయిన్ చేయబడుతుంది. మనం ప్రత్యేకింపబడ్డాం లేక ఆయన చిత్తానికి లోబడడం ద్వారా పరిశుద్ధతలోనికి పిలువబడ్డాం; మనం ఆయన చిత్తమందు జీవించడమనేది తన యెదుట మనలను పరిశుద్ధులు గాను నిర్దోషులు గాను నిలుపుతోంది. మన సహోదరుడైన పేతురు మాటలను మన హృదయంలోనికి స్వీకరించుదాం:

> అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు, మరి జాగ్రత్తపడుడి మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుయొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును (2 పేతురు 1:10, 11).

## కృపవలన ఏర్పరచబడినవారు

నాల్గవది, మనం కృపవలన ఏర్పరచుకొనబడినవారం. “తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు **తన చిత్త ప్రకారమైన దయాసంకల్పముచొప్పున**” దేవుడు మనలను ఏర్పరచుకొనినట్టు పౌలు తెలిపాడు (ఎఫెసీ. 1:5, 6; ఎంఫసిస్ నాది). మరో విధంగా చెప్పాలంటే, ఈ ఏర్పాటు దేవునియొక్క మంచితనంవలనను, ఆయన దయవలనను ప్రారంభించబడినదై సంపూర్ణం చేయబడింది.

ఆయన “చిత్తమును గూర్చిన దయాసంకల్పమేమి?” దేవుని చిత్తం, ఆజ్ఞలు,

ఉత్తరువులు, విధులతో కూడియుంటుంది. ఆయన చిత్తమంతా, దాని అవకాశమంతటి తోను అంశాలన్నిటితో కూడ, ఒక ప్రాథమిక ఉద్దేశము, అంతిమ దృక్పథం, కృపా నియమంతో కూడినదైయుంటుంది. దాని ప్రాథమిక ఉద్దేశమేమి? పాపమునుండి రక్షించి తనతో జీవింపజేసికోవాలని గదా? మరో విధంగా, ఆయన మనకు అతి శ్రేష్ఠమైన దాని నొసంగ వెదకుతున్నాడు. దేవుడు జరిగించినదంతా, మన క్షేమంకొరకు తన కనికరముగల అభిలాషతోనే చేశాడు. “ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుతూ మీ యెడల దీర్ఘ శాంతముగలవాడై యున్నాడు ...” అని పేతురు తెలిపాడు (2 పేతురు 3:9). పౌలు యిలా వ్రాశాడు, “ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది. ఆయన, మనుష్యులందరు రక్షణపొంది సత్యమునుగూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు” (1 తిమోతి 2:3, 4).

దేవునిచే ఏర్పరచబడిన జనులుగా, సంఘము యొక్క ఉనికి, “తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తి కలుగునట్లు” ఉద్దేశించబడింది (ఎఫెసీ. 1:6). దేవుడు సంఘాన్ని సంకల్పించాడు, సంఘంయొక్క రాకను ప్రవచింపజేసాడు, సంఘాన్ని కొనడానికి క్రీస్తు సిలువలో మరణించేలా ఆయనను పంపాడు, పెంతెకొస్తు దినాన అద్భుతరీతిగా దాన్ని ఆరంభించాడు, సువార్తయొక్క ప్రకటనను ఆయన కరుణాహస్తం చొప్పున నడిపించాడు – అయితే యిదంతా లోక రక్షణకొరకు దయాపూర్వకమైన తన ఉద్దేశం యొక్క నెరవేర్పుకొరకు జరిగించాడు. దైవికమైన ఈ కార్యానికి ప్రతిఫలంగా, ఆయన కృపామహిమకు కీర్తి కలుగునట్లు, సంఘం ఉనికిలోనికి వచ్చింది. శూన్యంలోనుండి ఆరంభమై లోకవ్యాప్తమైన జనమైనట్టు సంఘం తన్ను తాను పొగుడుకొనలేదు. దేవునియొక్క దయగల ఉద్దేశములు కార్యములందు మాత్రమే తాను అతిశయించగలడు. మన మహిమ ఆయన కృపయే.

నీ శ్రేయోభిలాషను నిరంతరం కోరేవారెవరైనా ఉన్నట్టు నీవెరుగుదువా? “తాను మొదట” అనుకోకుండ “నీవు మొదట” అనే తత్వంగల ఎవనినైనా నీవెరుగుదువా? ప్రతి దానిలో నిన్ను ప్రధానంగా ఎంచే వారెవరైనా ఉన్నారా? నీవు ఎన్నడే ఎరగని బహు నిస్వార్థపరమైన ఔదార్యంగల ఒక వ్యక్తిని ఊహించి, ఆ రూపాన్ని పది లక్షల సార్లు విస్తరింపజేసినట్లయితే, దేవుని రూపచిత్రం యొక్క ఆరంభాన్ని మాత్రమే నీవు చిత్రించగలవు. ఆయన చేయునదంతయు ఆయన ప్రేమాపూర్వకమైన దయతో కూడినదై యుంటుంది.

ఆయన కృపకు మనం కృతజ్ఞత గలవారమైయుండి, క్రీస్తునందు మనకున్న రక్షణనుబట్టి, ఆయన మనకు దయచేసిన పనినిబట్టి, భవిష్యత్తులో అంతములేని నిత్యత్వమందు దేవునిచే ఏర్పరచబడినవారుగా ఆయనతో మనకు ఉన్న మహిమనుబట్టి మనం ఆనందించాలి. దేవుని సాటిలేని కృపను గూర్చి ప్రతి పరిశుద్ధుని హృదయం నిరంతరం గానం చేస్తూ ఉండాలి. దేవుని కృపామహిమ మనయందు కృతజ్ఞత, స్తుతి, విశ్వాసం, మరియు విధేయత అనేవాటిని పుట్టిస్తూ ఉండాలి.

## ముగింపు

పౌలుయొక్క కలం ద్వారా సంఘము దేవునిచే ఎన్నుకొనబడినవారిని పరిశుద్ధాత్మ, నిజంగా మనకు బోధించాడు. క్రీస్తునందు దేవుడు మనలను ఏర్పరచుకున్నాడని, నిత్యత్వంనుండి మనలను ఏర్పరచుకున్నాడని, పరిశుద్ధతకొరకు మనలను ఏర్పరచు కున్నాడని, కృపవలన మనలను ఏర్పరచుకున్నాడని ఆయన మనకు తెలిపాడు. మనం ఆయన కంటి పాపయై ఉన్నాం. ఈ లోక సృష్టిని ఆయన సంకల్పించినప్పుడు మనం ఆయన తొలి ఆలోచనయై ఉన్నాం, నేడు మనం ఆయన ప్రధాన ఆలోచనయై ఉన్నాం.

క్రీస్తునకు వెలుపట ఉన్న ఎవడైనా, ఏర్పరచబడినవారి పరిధికి బయటనున్నవాడు, ఆలస్యం చేయకుండ ఆయన శరీరంలోనికి ప్రవేశించాలి. నేను హై స్కూలులో ఉన్నప్పుడు, హై స్కూలుయొక్క ఇయర్ బుక్‌లో "ఎవరు ఎవరు" అనే దానిలో పెట్టడానికి అసాధారణమైన విద్యార్థులను ఎన్నుకునేవారు. కొద్దిమంది మాత్రమే ఎన్నుకోబడేవారు; మరియు ఆ ఎన్నిక విద్యార్థియొక్క పేరు, ప్రఖ్యాతి, ప్రత్యేకమైన టేలెంట్, విశేషమైన రికార్డు మీద ఆధారపడేది. దేవుని యొక్క "ఎవరు ఎవరు?" అనేది సంఘమే. "ఎవరు ఎవరు" అనేది మనం చేసికొనే నిర్ణయం మీదనేగాని దేవుడుచేసే నిర్ణయం మీద కాదు. మన విశ్వాసము, క్రీస్తు ప్రభువుకు మనం కనుపరచే విధేయతనుబట్టి ఆ ఏర్పరచబడిన గుంపులో ఆయన మనలను చేర్చుతాడు, మన పేరు ప్రఖ్యాతులలో, టేలెంట్స్ లేక రికార్డును బట్టియో కాదు. తన ప్రియుడైన క్రీస్తుయేసునందు ఆయన ప్రసాదించిన తన కృపా కార్యము ద్వారా, ఏర్పాటులోనికి రానివారందరు క్రీస్తు శరీరంలో ప్రవేశించి, ఏర్పరచబడిన జనంగా రూపొందాలని ఆయన కోరుతున్నాడు. రక్షణకొరకు ఏర్పరచబడిన వారుగా, సమృద్ధియైన జీవము, పరలోకమందు నిత్యజీవము ప్రసాదించాలని ఆయన ఆశిస్తున్నాడు.

కోరుకున్నవారిలో ఉండేలా కోరుకో. ఏర్పరచబడినవారిలో ఉండేలా ఏర్పరచుకో. ముందుగా నిర్ణయింపబడిన దేవుని పిల్లలలో ఉండ నిర్ణయించుకో.

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. క్రీస్తు శరీరములోని సభ్యులందరు దేవునిచే ఏర్పరచబడినవారని నీవంటావా?
2. ఎఫెసీ. 1:4–6లో పౌలు ప్రకారం, క్రీస్తునందు ఆత్మసంబంధమైన ఏ ఆశీర్వాదాలు కన్పిస్తాయ్?
3. ఒక జనమును ముందుగా నిర్ణయించడానికిని ఒక వ్యక్తిని ముందుగా నిర్ణయించడానికినిగల వ్యత్యాసమేమి?
4. "భవిష్యద్ నిర్ణయం" అనే పదానికి భావమేమి?
5. "భవిష్యద్ జ్ఞానానికిని," "భవిష్యద్ నిర్ణయానికినిగల" వ్యత్యాసమేమి?
6. మనం దేవునిచే ఏర్పరచబడ్డామని ఎలా తెలిసికోగలం?
7. ఆయనయందు దేవుడు మనలను ఎప్పుడు ఏర్పరచుకున్నాడు?
8. మనం ఏమిచేయాలని లేక ఎలా ఉండాలని దేవుడు ఏర్పరచుకున్నాడు?

9. “పరిశుద్ధత” అనే పదాన్ని నిర్వచించుము.
10. “కృపవలన ఏర్పరచబడ్డారు” అనే ప్రయోగానికి భావమేమి?
11. “దేవునిచే ఏర్పరచబడినవారు” అనే ప్రయోగం నిన్ను ఎలా ప్రోత్సహించుతుంది?
12. దేవునిచే ఏర్పరచుకొనబడినవారిలో మనమెలా ఒకరమై ఉండగలం?